సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం । 29 । జనవరి । 2023



sunday special

నృత్యం చేస్తున్న కళాకారులు

స్వర నీరాజనం.. నృత్య మనోహరం



- శ్రీ వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో కళాకారుల వైభవం
- కరీం'నగరం'లో నిత్య కీర్తనలు.. సాంస్కృతిక నృత్యాలు
- రాష్ట్ర నలుమూల నుంచి వేలమంది కళాకారుల రాక
- పదిరోజుల పాటు వివిధ ప్రత్యేక కార్యక్రమాలు
- వేదికపై మూడువేల మందితో నిత్య గీతారాధన

కరీం'నగరం' గోవింద నామస్మరణతో మార్మోగుతోంది. వెంకన్నసేవలో తరిస్తోంది. నగరంలోని మార్కెట్ రోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మి– పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23నుంచి వైభవంగా కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 2వ తేదీ గురువారం శోభాయాత్రతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ వేడుకలు ఓవైపు ఆధ్యాత్మికను పంచుతుండగా.. మరోవైపు వెంకన్నకు స్వరనీరాజనం పలుకుతున్నారు పలువురు కళాకారులు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తూ... సంకీర్తనలు, వివిధ సాంస్కృతిక నృత్యాలతో కళావేదికపై మనోహరాన్ని పంచుతున్నారు. వెంకన్న బ్రహ్మోత్సవాల్లో కళావైభవం.. పలు కళారంగాలకు చెందిన వారిపై సండే స్పెషల్..

– సాక్షి, కరీంనగర్ డెస్క్

నిత్యం 200 మందితో..



కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు ఏటా వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు ఆధ్యాత్మికతను పంచే విధంగా కళావేదికపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిత్యం 200 వందలమంది కళాకారులతో ఉదయం పదిగంటల నుంచి రాత్రి 12 గంటల వరకు పారాయణం, కచేరీ, భజనలు, సంకీర్తనలు, జానపద నృత్యాలు, కూచిపూడి, భరత నాట్యం, సంగీత విభావరి,భక్తి నాటకాలు ప్రదర్శిస్తున్నారు. 10 రోజులు పాటు జరిగే కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లానే కాకుండా తెలంగాణ నలువైపుల నుంచి మూడువేలకు పైగా కళాకారులు తరలివచ్చి స్వామివారికి నీరాజనం పలుకుతున్నారు. శనివారం వరకు సుమారు రెండువేల మంది కళాకారులు ప్రదర్శనలు ఇచ్చినట్లు బ్రహ్మోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి గోగుల ప్రసాద్ వివరించారు.

అనర్గళంగా చాలీసా పారాయణం



కరీంనగర్ పట్టణంలోని పాతబజార్ ప్రాంతానికి చెందిన హనుమాన్ సేవా సమితి సభ్యులు చాలీసా పారాయణంలో ఆకట్టుకుంటున్నారు. ఈ సేవా సమితి ప్రస్తుతం 500కు పైగా సభ్యులతో కొనసాగుతోంది. ప్రతీ కార్యక్రమంలో 50మందితో చాలీసా పారాయణం చేస్తున్నారు. కొండగట్టులో జయంతి ఉత్సవాల సందర్భంగా 2022లో 41 రోజుల చాలీసా పారాయణం చేశారు. 2021లో కొండగట్టులో 18రోజుల పాటు, 2019లో నగునూరు దుర్గాభవాని ఆలయంలో చాలీసా పారాయణం చేశారు. నగరంలోని వెంకన్న బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం నిర్వహించిన చాలీసా పారాయణం ఆకట్టుకుంది. 500మంది సభ్యులతో హనుమాన్ చాలీసా పారాయణం చేసే హనుమాన్ సేవా సమితికి గతంలో వరల్డ్ రికార్డులో సైతం చోటు దక్కింది.

ఆనందంగా ఉంటుంది



మేమంతా కలిసి వివిధ ఆలయాల్లో భజన కార్యక్రమానికి వెళ్తుంటాం.. ప్రతీ ఆలయంలో తక్కువలో తక్కువగా గంటకుపైగానే కార్యక్రమాలు నిర్వహిస్తాం.. మా బృందంలో వృద్ధుల నుంచి యువకుల వరకు ఉన్నారు. దేవుళ్ల పాటలు పాడుతుంటే మనసులో తెలియని ఆనందం ఉంటుంది.

– రాజ్‌కుమార్, శివరామకృష్ణ భజన మండలి, గట్టుదుద్దెనపల్లి

ఏళ్ల తరబడి..



కరీంనగర్‌లో ఏళ్ల తరబడి చాలీసా పారాయణం చేస్తున్నాం. పాతబజారులో వేలాది మంది సభ్యులతో నిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పదిమందితో ప్రారంభమై.. ఇప్పుడు ఐదువందలకు పైగా సభ్యులతో కొనసాగుతున్నాం. చాలీసా పారాయణంతో మనసు భక్తిపారవశ్యంతో ఉంటుంది. బ్రహ్మోత్సవాల్లో అవకాశం పూర్వజన్మ సుకృతం.

– భోగ శ్రీనివాస్, హనుమాన్ సేవా సమితి, పాత బజార్, కరీంనగర్

సంకీర్తనల 'రేవతి'



కరీంనగర్ పరిధిలోని తీగలగుట్టపల్లి ప్రాంతానికి చెందిన బొజ్జ రేవతి గృహిణి. సంగీతంలో డిప్లొమా చేశారు. 20 సంవత్సరాల నుంచి భక్తి కీర్తనలు పాడుతున్నారు. ధర్మపురి, వేములవాడ, యాదగిరిగుట్ట ఆలయాల్లో రెగ్యులర్‌గా ప్రదర్శనలు ఇస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఐదుసార్లు, ఒకసారి నాదనీరాజనంలో ప్రదర్శన ఇచ్చారు. 2020 జనవరి 2న అమెరికాలోని న్యూ జెర్సీలో సాయిదత్త పీఠంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అప్పుడు మంత్రి పద్మాదేవేందర్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ గాయని అవార్డు అందుకున్నారు. 2022 సెప్టెంబర్‌లో కరీంనగర్‌లో తెలంగాణ వజ్రోత్సవాల్లో ఉత్తమ గాయని అవార్డు తీసుకున్నారు. కరీంనగర్‌లోని వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో ఐదుసార్లు ప్రదర్శన ఇచ్చారు.

'సురభి' ప్రదర్శనలు



వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో హైదరాబాద్‌కు చెందిన శ్రీ వేంకటేశ్వర సురభి థియేటర్ కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. శ్రీ కృష్ణ లీలలు, పాతాలభైరవి, భక్త ప్రహ్లాద, మాయాబజార్, శ్రీ వేంకటేశ్వర నాటకాలు కలకాలం గుర్తుండిపోతాయి. 138 ఏళ్ల చరిత్ర ఈ కళాకారులకు ఉంది. ప్రస్తుతం ఆరోతరం వారు సైతం ఇదే రంగంలో రాణిస్తున్నట్లు సురభి డైరెక్టర్ జయచంద్ర వర్మ వివరించారు. కరీంనగర్‌లోని వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడేళ్లుగా వీరు నాటక ప్రదర్శన ఇస్తున్నారు. ప్రస్తుత బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 25, 26 రోజున భక్త ప్రహ్లాద, పాతాళభైరవి నాటకాలతో ఆకట్టుకున్నారు. ఈ బృందంలో 60 మంది ఉన్నారు.

నాట్య మయూరాలు.. ఈ తల్లీకూతుళ్లు



సిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన అనూషా యశస్విని ప్రభుత్వ టీచర్. ప్రస్తుతం ముస్తాబాద్ మండలం కొండాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉద్యోగం చేస్తున్నారు. యశస్వినికి చిన్నతనం నుంచి నృత్యం అంటే ఇష్టం. సిరిసిల్లలోని శ్రీబాలా త్రిపుర సుందరి కూచిపూడి నాట్యాలయంలో గురువు భోగ ధర్మరాజు నేతృత్వంలో యశస్విని కూతురు శ్రీమేధతో కలిసి నృత్యంతో సాధన చేస్తున్నారు. శ్రీమేధ ప్రస్తుతం ఆరోతరగతి చదువుతోంది. వేములవాడలో మహాశివరాత్రికి, కొండగట్టులో హనుమాన్ జయంతి సందర్భంగా, ఇటీవల కరీంనగర్‌లో వెంకన్న బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. మొత్తంగా ఇప్పటి వరకు 30కి పైగా ప్రదర్శనలు ఇచ్చారు. అనూషా యశస్విని చెల్లెలి కూతురు హస్విణి సైతం కూచిపూడిలో రాణిస్తోంది. హస్విణి తల్లిదండ్రులు నరేశ్– నిరోషా చిన్నారి ప్రతిభను గుర్తించి కరీంనగర్‌లోని సంస్కృతి టెంపుల్ ఆఫ్ డ్యాన్స్‌లో గురువు సురేంద్రచారి వద్ద శిక్షణ ఇప్పిస్తున్నారు. రెండో తరగతి చదువుతున్న హస్విణి వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శన ఇచ్చి టౌన్, ట్రాఫిక్ ఏసీపీలు తుల శ్రీనివాస్‌రావు, విజయ్‌కుమార్‌ల నుంచి ప్రశంసలు పొందింది.

భక్తి భజనలో గట్టుదుద్దెనపల్లి వాసులు



కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన శివరామకృష్ణ భజన మండలి సభ్యులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ముందుంటున్నారు. ఈ భజన మండలి 40ఏళ్లుగా 19మంది సభ్యులతో కొనసాగుతోంది. ప్రముఖ గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయ చైర్మన్ శంకరలింగం ఆధ్వర్యంలో భజన మండలి సభ్యులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వీరు ఇప్పటి వరకు వేములవాడ, యాదాద్రి, కొండగట్టు, భద్రాచలంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరి బృందంలో 60 ఏళ్ల వయసు ఉన్న పెద్దల నుంచి 22 ఏళ్ల యువకుల వరకు స్వామివార్ల ఆరాధన చేస్తున్నారు. కరీంనగర్ వెంకన్న బ్రహ్మోత్సవాల్లో ఈనెల 27న వీరు ప్రదర్శన ఇచ్చారు. ఆంజనేయస్వామి గీతాలు, అయ్యప్ప కీర్తనలు, వెంకన్న పాటలతో ఆకట్టుకుంటున్నారు.

అదృష్టంగా భావిస్తున్నా..



బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆర్గనైజ్ చేయడం అదృష్టంగా భావిస్తున్నా.. మంత్రి కమలాకర్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మినీ తిరుమలను తలపిస్తోంది. కళావేదికపై వేలాదిమంది కళాకారులు తమ ప్రతిభను చాటుతుండగా.. మేము వారిని సత్కారాలతో అభినందిస్తున్నాం. శోభాయాత్రలో మూడువేల మంది కళాకారుల ప్రదర్శనలు ఉంటాయి.

– గోగుల ప్రసాద్, బ్రహ్మోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



సిరిసిల్ల: కలెక్టర్ అనురాగ్ జయంతిని శనివారం ఎస్పీ అఖిల్ మహాజన్ కలిశారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలిసి పూలమొక్క అందించారు. ఎస్పీకి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

అర్హులకు డబుల్ ఇళ్లు



ఇళ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కల నిజం చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులను జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావు, ఎంపీపీ పిల్లి రేణుకతో కలిసి శంకుస్థాపన చేశారు. సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో చిరంజీవి, సర్పంచ్ రవి, ఎంపీటీసీ బాబు, నాయకులు అందె సుభాష్, కిషన్, నర్సింహులు, అనిల్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు పోటీపరీక్షలకు సిద్ధమైన నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ శంకరయ్య కోరారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం విలేకరులతో మాట్లాడారు. వేములవాడలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు సహకారంతో రూ.1.10 కోట్లతో అధునాతన గ్రంథాలయం ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. గంభీరావుపేటలోని గ్రంథాలయాన్ని మంత్రి కేటీఆర్ త్వరలో ప్రారంభిస్తారని.. ముస్తాబాద్‌లో నిర్మాణానికి రూ.25లక్షలు కేటాయించినట్లు తెలిపారు.

ఎల్ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి కరీంనగర్ ఎల్ఎండీలోకి శనివారం నీటిని విడుదల చేశారు. రెండు గేట్ల ద్వారా 4,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి గోవర్ధన్‌రావు

వేములవాడఅర్బన్: విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకెళ్తే లక్ష్యాలను చేరుకుంటారని టెక్స్‌టైల్ టెక్నాలజీ పూర్వ విద్యార్థి సీహెచ్.గోవర్ధన్‌రావు పేర్కొన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ఎస్సారార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించిన 'ఆలమ్ని టాక్స్' కార్యక్రమానికి హాజరైన గోవర్ధన్‌రావు మాట్లాడారు. డిప్లొమా విద్య తన జీవితంలో విజయానికి గట్టి పునాది వేసిందన్నారు. టెక్స్‌టైల్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ డిగ్రీతో కంప్యూటర్‌రంగంలో ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. టెక్స్‌టైల్ టెక్నాలజీ విద్యార్థులకు స్పిన్నింగ్, వీవింగ్, కెమికల్ ప్రాసెసింగ్, గార్మెంట్స్ తయారీ పరిశ్రమలతోపాటు మర్చండైసింగ్, రిటైల్ మార్కెటింగ్, టెక్నికల్ టెక్స్‌టైల్, రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్, అధ్యాపకులు ప్రభాకరాచారి, అజయ్‌కుమార్, శేఖర్ ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం



రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ

ఇల్లంతకుంట(మానకొండూర్): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని కరీంనగర్ రేంజ్ డీఐజీ రమేశ్‌నాయుడు హెచ్చరించారు. ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌ను శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఠాణాకు వచ్చే ఫిర్యాదుదారులపై స్నేహపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. ఎస్సై మహేందర్, సిబ్బంది ఉన్నారు.

భద్రతలో భళా.. బడిలో డీలా!

- సామాజిక భద్రతలో పాత జిల్లా మెరుగు
- బడిలో వెనుకబడిన ఉమ్మడి జిల్లా
- తలసరి ఆదాయం, విద్యుత్తు కనెక్షన్లలో ముందంజ
- నాలుగు జిల్లాల్లో మెరుగుపడాల్సిన రహదారులు
- రాష్ట్ర గణాంక నివేదికలో వెల్లడి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు వంటి సామాజిక భద్రత విషయంలో ఉమ్మడి జిల్లా భళా అనిపించుకుంది. ముఖ్యంగా మౌలిక సదుపాయాలైన తలసరి ఆదాయం, విద్యుత్ కనెక్షన్లు, రహదారులు తదిరాల విషయంలోనూ రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలతో పోల్చినప్పుడు ముందంజలోనే ఉంది. అదే సమయంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాఠశాలల ఏర్పాటు విషయంలో మాత్రం చాలా వెనుకబడి ఉంది. వివిధ విభాగాల్లో 33 జిల్లాలు సాధించిన పురోగతిని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తెలంగాణ రాష్ట్ర గణాంకాల నివేదికలో పొందుపరిచింది.

విద్యుత్తు కనెక్షన్లలో కరీంనగర్ టాప్..!

రాష్ట్రంలో విద్యుత్తు కనెక్షన్ల విషయంలో ఉమ్మడి జిల్లా ముందంజలో ఉంది. జిల్లాల విద్యుత్తు వ్యవసాయ, గృహ, పారిశ్రామిక కనెక్షన్లను గమనిస్తే.. హైదరాబాద్ తొలిస్థానంలో ఉండగా.. కరీంనగర్ 10వ స్థానంలో నిలిచింది. పెద్దపల్లి (13వ స్థానం), జగిత్యాల (17వస్థానం) తరువాత స్థానంలో నిలిచా యి. రాష్ట్రవ్యాప్తంగా తలసరి విద్యుత్తు వినియోగం 2020–21లో 2012 కిలోవాట్లుగా ఉండగా.. 2021–22లో 2126 కిలోవాట్లకు చేరడం గమనార్హం.

ర్యాంకు	జిల్లా	మొత్తం కనెక్షన్లు
10	కరీంనగర్	5,39,036
13	పెద్దపల్లి	5,05,611
17	జగిత్యాల	3,53,141

దారిన పడని రహదారులు..!

ర్యాంకు	జిల్లా	మొత్తం రోడ్లు (కి.మి)
15	జగిత్యాల	2,967
21	కరీంనగర్	2,570
25	పెద్దపల్లి	2,275
28	రాజన్న సిరిసిల్ల	2,082

మౌలిక సదుపాయాల్లో కీలకమైన రహదారుల విషయంలో ఉమ్మడి జిల్లా వెనకబడిందనే గణాంకాలు చెబుతున్నాయి. 33 జిల్లాల్లో ఉన్న జాతీయ, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రహదారుల వివరాలను పరిశీలించినప్పుడు ఇదే విషయం స్పష్టమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల రోడ్లను పరిశీలిస్తే.. జగిత్యాల 15వ స్థానంలో మెరుగైన ర్యాంకుతో ఉంది. తరువాత స్థానంలో కరీంనగర్ (21వస్థానం), పెద్దపల్లి (25వస్థానం), రాజన్నసిరిసిల్ల (28వస్థానం)లో నిలిచాయి.

తలసరి ఆదాయం సూపర్

ర్యాంకు	జిల్లా	తలసరి ఆదాయం
12	కరీంనగర్	రూ.1,10,568
13	పెద్దపల్లి	రూ.1,06,184
24	రాజన్నసిరిసిల్ల	రూ.88,932
27	జగిత్యాల	రూ.84,742

రాష్ట్రవ్యాప్తంగా పౌరుల తలసరి ఆదాయం గణాంకాల్లో ఉమ్మడి జిల్లా మంచి ర్యాంకును నమోదు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పౌరుల సరాసరి సగటు తలసరి ఆదాయం రూ.1,43,023గా ఉంది. జిల్లాల విషయానికి వస్తే.. రంగారెడ్డి రూ.4,18,964తో టాప్‌లో నిలిచింది. కరీంనగర్ జిల్లా 12వ ర్యాంకుతో ఉమ్మడి జిల్లాలో అగ్రస్థానం దక్కించుకుంది. అదే సమయంలో పెద్దపల్లి (13వస్థానం)తో రెండోస్థానంలో నిలవగా.. రాజన్నసిరిసిల్ల (24), జగిత్యాల (27)తో కాస్త వెనకబడ్డాయి.

పాఠశాలల్లో దయనీయం..

ర్యాంకు	జిల్లా	మొత్తంస్కూళ్లు	విద్యార్థులు
05	రాజన్నసిరిసిల్ల	655	78,195
08	పెద్దపల్లి	769	98,425
11	కరీంనగర్	1,014	1,46,920
17	జగిత్యాల	1,122	1,46,632

పాఠశాలల విషయంలో ఉమ్మడి జిల్లా చాలా వెనకబడి ఉంది. పాఠశాలల సంఖ్యను విద్యార్థుల సంఖ్యతో సగటు లెక్కించినప్పుడు ఈ విషయం స్పష్టమవుతోంది. తక్కువ స్కూళ్ల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో రాష్ట్రంలో రాజన్నసిరిసిల్ల జిల్లా 5వ స్థానంలో నిలిచింది. అదే సమయంలో పెద్దపల్లి (8వ స్థానం), కరీంనగర్ (11వ స్థానం), జగిత్యాల (17వ స్థానం)లో నిలిచాయి.

సామాజిక భద్రతలో భేష్

నిరుపేదలు, సమాజంలో పలు కారణాల వల్ల వెనకబడిన పలువురికి ప్రభుత్వం సామాజిక భద్రత కింద బియ్యం, పింఛన్లు అందజేస్తోంది. ఈ విషయంలో ఉమ్మడి జిల్లాలో మెజారిటీ పేదలకు రేషన్‌కార్డులు, పింఛన్లు అందజేస్తోంది. రేషన్‌కార్డుల విషయంలో జగిత్యాల రాష్ట్రంలో 9వ స్థానంలో ఉమ్మడి జిల్లాలో తొలిస్థానంలో నిలిచింది. కరీంనగర్ (12వ స్థానం), పెద్దపల్లి (20వ స్థానం), సిరిసిల్ల (26వ స్థానం) తరువాత స్థానాల్లో నిలిచాయి. అదే వృద్ధాప్యం, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ రోగులకు ప్రభుత్వపరంగా అందజేసే పింఛన్ల విషయంలోనూ జగిత్యాల రాష్ట్రంలో 3వ స్థానం, ఉమ్మడి జిల్లాలో తొలిస్థానం దక్కించుకుంది. కరీంనగర్ (12వస్థానం), పెద్దపల్లి (20వ స్థానం), సిరిసిల్ల (26వస్థానం) తరువాత స్థానాలు దక్కించుకున్నాయి.

ర్యాంకు	జిల్లా	షాపులసంఖ్య	ఎఫ్ఎస్‌సీకార్డు
09	జగిత్యాల	593	2,95,915
12	కరీంనగర్	487	2,64,490
20	పెద్దపల్లి	413	2,09,954
26	సిరిసిల్ల	344	1,61,524

ఆసరా పింఛన్లు ఇలా..

ర్యాంకు	జిల్లా	మొత్తం పింఛన్లు
03	జగిత్యాల	2,29,459
13	కరీంనగర్	1,41,923
16	సిరిసిల్ల	1,21,295
25	పెద్దపల్లి	98,009

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ



ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా విధుల్లో చేరిన అఖిల్ మహాజన్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించారు. బీఆర్ఎస్ నాయకులు రాఘవరెడ్డి ఉన్నారు.

మల్లన్నసాగర్ కెనాల్ నిర్మాణానికి భూసేకరణ

- మల్లన్నసాగర్ ప్రాజెక్టు డీఈఈ శ్రీనివాస్

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో మల్లన్నసాగర్ కెనాల్ నిర్మాణానికి భూసేకరణ చేపడుతున్నామని డీఈఈ శ్రీనివాస్ తెలిపారు. మల్లన్నసాగర్ కెనాల్ ద్వారా ముస్తాబాద్ మండలంలో 15వేల ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. ఇప్పటికే చీకోడు, మద్దికుంట, మోహినికుంట, నామాపూర్ గ్రామాల్లో భూసేకరణ చేపట్టామని, ముస్తాబాద్‌లో 10 కిలోమీటర్ల 7ఆర్ డిస్ట్రిబ్యూటరీ ద్వారా కెనాల్ నిర్మిస్తామన్నారు. ఈమేరకు అవసరమైన భూమి కోసం రైతులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. బందనకల్, వెంకట్రావుపల్లె వరకు 7ఆర్ చీకోడు డిస్ట్రిబ్యూటరీ ద్వారా ప్రధాన కెనాల్‌తోపాటు సబ్‌కెనాల్స్ నిర్మిస్తామన్నారు. సర్పంచ్ సుమతి, ఉపసర్పంచ్ రవీందర్‌గౌడ్, రైతులను కలిసి భూసేకరణకు సహకరించాలని కోరినట్లు తెలిపారు. ఏఈ రోహిత్ ఉన్నారు.

పుల్లూరి శ్రీకాంత్‌కు డాక్టరేట్

- అందించిన గ్లోబల్ ఎకానమీ ఫోరమ్



గ్లోబల్ ఎకానమీ ఫోరమ్‌లో డాక్టరేట్ అందుకుంటున్న పుల్లూరి శ్రీకాంత్

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన యువ వ్యాపారి పుల్లూరి శ్రీకాంత్‌కు డాక్టరేట్ లభించింది. ఇండోనేషియాలోని గ్లోబల్ ఎకానమీ ఫోరమ్ డాక్టరేట్‌ను శనివారం ప్రదానం చేసింది. శ్రీకాంత్ చేస్తున్న సామాజికసేవ కార్యక్రమాలకు గుర్తింపుగా అంతర్జాతీయసంస్థ ఇండోనేషియాలో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శ్రీకాంత్ తల్లిదండ్రులు పుల్లూరి రాధా, కృష్ణమూర్తిలు సిరిసిల్లలో ప్రముఖ హార్డ్‌వేర్ వ్యాపారులుగా స్థిరపడ్డారు.


ఇసుకడంపులు స్వాధీనం

వేములవాడరూరల్: మండలంలోని నాగాయపల్లిలో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామ శివారులో దాదాపు 10 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా నిల్వచేశారని సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లి స్వాధీనం చేసుకొని రెవెన్యూశాఖకు అప్పగించారు. ఎస్సై మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సామాన్యులు.. సాధించారు

- స్వయంకృషితో రాణిస్తున్న యువత
- అభిరుచితో కొందరు, ఆసక్తితో మరికొందరు..
- పరిస్థితులను ఎదురించి.. లక్ష్యం చేరుకున్న వైనం
- నేటి యువతకు ఆదర్శం

సిరిసిల్లకల్చరల్: జీవితంలో నిలదొక్కుకోవాలనే ఆకాంక్షకు పట్టుదల, కృషి తోడైతే వారు అభిజ్ఞారెడ్డి, గోదావరి, వేణుమాధవ్ అవుతారు. తమ లక్ష్యాన్ని ముందుగానే నిర్ణయించుకున్నారు. అందుకుతగ్గట్టే కష్టపడి ఇష్టంగా చదివారు. కుటుంబ పరిస్థితులు అనకూలించకపోయినప్పటికీ వారి మనోసంకల్పం ముందు చిన్నబోయాయి. ఆర్థిక సమస్యలను తమ ప్రతిభతోనే గెలిచారు. విద్యార్థి దశలో కన్న కలలను నిజం చేసుకున్నారు. ఒకరు వైద్యులుగా గ్రామీణులకు సేవలందిస్తుండగా.. మరొకరు కవితలతో సామాజికాంశాలను లేవనెత్తుతున్నారు.. మరొకరు కరాటేలో రాణిస్తున్నారు. కష్టాలు ఆ సమయం వరకేనని.. ఎన్ని అడ్డంకులు ఎదురైన అనుకున్న లక్ష్యం కోసం శ్రమిస్తే సాధిస్తామని నేటి యువతకు చెబుతున్నారు.



అభిజ్ఞరెడ్డి వెలువరించిన పుస్తకం

పంచ్ పడితే పతకమే..



సిరిసిల్ల పట్టణానికి చెందిన దూస గోదావరిది అతి సామాన్య కుటుంబం. తండ్రి శ్రీనివాస్ గుమస్తా, తల్లి గృహిణి. చేనేత కుటుంబంలో పుట్టిన ఆమె చదువుతోపాటు తనకు ఇష్టమైన మార్షల్‌ఆర్ట్స్ నేర్చుకోవాలని ఆశించింది. కుటుంబ పరిస్థితులు అంతంతే.. అయినప్పటికీ శిక్షకుల ప్రోత్సాహంతో శిక్షణ పూర్తిచేసింది. కిక్‌బాక్సింగ్, కుంగ్‌ఫూ, తైక్వాండో విద్యల్లో రాణిస్తోంది. కరాటేలో బ్లాక్‌బెల్ట్, తైక్వాండోలో రెడ్‌బెల్ట్ సాధించింది. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాల పంట పండిస్తోంది. సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కాలేజీలో ఫైనలియర్ చదువుతోంది. ఇప్పటి వరకు పదికి పైగా బంగారు పతకాలు, 7 రజతం, 5 కాంస్య పతకాలు సాధించింది. ఒలింపిక్స్‌లో ఆడాలనే గోదావరి కల నెరవేరాలని ఆశిద్దాం.

గ్రామీణులకు వైద్యసేవలు



రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన కోన శ్రీనివాస్, లత దంపతుల కొడుకు వేణుమాధవ్‌కు డాక్టర్ కావాలనేది చిన్ననాటి కల. అతి సామాన్య కుటుంబం అయినప్పటికీ బిడ్డ ఎదుగుదల కోసం ఆ తల్లిదండ్రులు సైతం శక్తికి మించి శ్రమించారు. వేణుమాధవ్ పదో తరగతిలో 2013లో 9.7 జీపీఏ సాధించాడు. కరీంనగర్‌లోని ప్రైవేట్ కాలేజీలో బీపీసీలో ఇంటర్మీడియెట్‌లో చేరి 96.5 శాతం మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. ఎంసెట్ పరీక్ష రాసి హైదరాబాద్‌లోని మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్‌లో చేరాడు. 2022 మే 22న డాక్టర్ పట్టా అందుకున్న వేణుమాధవ్ ఈ నెల 1వ తేదీన ప్రభుత్వ వైద్యుడిగా కొలువుదీరాడు. పాతికేళ్లు నిండకుండానే పల్లె ప్రజలకు వైద్య సేవలందిస్తున్నాడు. ప్రస్తుతం కోనరావుపేట మండల ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిగా విధుల్లో చేరాడు.

సామాజికాంశాలే నేపథ్యం..



గంభీరావుపేట మండలానికి చెందిన అభిజ్ఞారెడ్డి తండ్రి బాల్‌రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తల్లి రూప ప్రైవేట్ టీచర్. అమ్మాయి చదువు కోసం సిరిసిల్లలో స్థిరపడ్డారు. అభిజ్ఞకు సామాజిక పరిశీలన ఎక్కువే. ఐఏఎస్ ఆఫీసర్ కావాలనేది ఆకాంక్షతో ఇంటిగ్రేటెడ్ బీఏలో చేరింది. ప్రస్తుతం బెంగళూర్ యూనివర్సిటీలో ఎంఏ పొలిటికల్ సైన్స్ చదువుతోంది. కళాశాల అనుభవాలతోపాటు తాను పరిశీలించిన సామాజికాంశాలను అక్షరీకరిస్తోంది. తాను రాసిన కవితలను స్నేహితులతో కలిసి సంకలనాలు వెలువరించింది. సుమారు 10 సంకలనాల ప్రభావంతో సొంత పుస్తకాన్ని ముద్రించేందుకు పబ్లిషర్స్ ముందుకు రావడం విశేషం. తన కవితలతో పుస్తకం వెలువరించింది. కరోనా సంక్షోభ సమయంలోని సామాజిక జీవన పరిస్థితులను అక్షరీకరించింది. ఆ కవితలతో 'ఐ రోట్ దెమ్ ఇన్ ద మినిట్ ఐ ఫెల్ట్ దెమ్' శీర్షికతో కవిత సంకలనాన్ని వెలువరించింది. ఆ పుస్తకం అమెజాన్‌లో అత్యధిక సంఖ్యలో అమ్ముడవుతోంది.

అనువంశిక అర్చక ట్రస్టు అధ్యక్షుడిగా ప్రతాప రామకృష్ణ



సమావేశమైన అనువంశిక అర్చక ట్రస్టు ప్రతినిధులు

వేములవాడ: రాజన్న ఆలయ అనువంశిక అర్చక ట్రస్టు అధ్యక్షుడిగా ప్రతాప రామకృష్ణను శనివారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మధు రాధాకిషన్, ఉపాధ్యాయుల సాంబశివుడు, ప్రధాన కార్యదర్శిగా మామిడిపల్లి రాజన్న, సంయుక్త కార్యదర్శిగా బుడంగారి మహేశ్, కోశాధికారిగా పురాణం రాములను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా గోపన్నగారి శివ, మామిడిపల్లి వెంకటేశం, రాచకొండ రామాచార్యులు, వొజ్జల సతీశ్‌కుమార్, దివన్నగారి శరీశ్‌లను ఎన్నుకున్నారు. రాజన్న ఆలయంలో నిత్యం జరిగే చతుష్కాల పూజలు, వార్షిక పండుగల్లో కైంకర్యసేవకు అవకాశం కల్పించాలని తీర్మానించినట్లు రామకృష్ణ తెలిపారు.

'జనావాసాల మధ్య రైస్‌మిల్‌కు అనుమతి ఇవ్వొద్దు'

వేములవాడ: వేములవాడ పట్టణ శివారులోని మల్లారంరోడ్డులో సర్వే నంబర్ 1482 జనావాసాలకు మధ్యలోనే రైస్‌మిల్ నిర్మాణానికి అవకాశం ఇవ్వొద్దని మున్సిపల్ కమిషనర్ అన్వేశ్‌కు స్థానికుడు జార్జ్ శనివారం వినతిపత్రం అందించారు. రెసిడెన్షియల్ జోన్ పరిధిలో నిబంధనలు ఉల్లంఘిస్తూ రైస్‌మిల్ నిర్మాణానికి అనుమతినిచ్చారని, కమిషనర్ చొరవ తీసుకోకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని జార్జ్ పేర్కొన్నారు.

జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రాలు

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడు కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించారు. ముస్తాబాద్, ఇల్లంతకుంట, వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో 1,758 ఎకరాల్లో కందిపంటను సాగు చేశారని, 8,760 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా ఉందన్నారు. ప్రభుత్వం క్వింటాలు కందులకు రూ.6,600 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. రైతులు మద్దతు ధరకే కందులను అమ్ముకోవాలని, దళారులకు అమ్మి నష్టపోవద్దని కోరారు. జిల్లా వ్యవసాయాధికారి రణధీర్‌కుమార్, మార్క్‌ఫెడ్ అధికారి దివ్యభారతి, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్

ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పోలీస్‌శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూనే ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. తంగళ్లపల్లి మండలం తాడూర్ పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో శనివారం అర్మ్‌డ్ రిజర్వ్, సివిల్ పోలీస్, హోమ్‌గార్డ్స్ నిర్వహించిన వీక్లి పరేడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యోగా, ధ్యానం, నడకను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. ఇంటి భోజనానికి ప్రాధన్యతనివ్వాలని సూచించారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారితో మర్యాదగా నడుచుకోవాలన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్, ఆర్ఐలు కుమారస్వామి, రజనీకాంత్, యాదగిరి, సీఐలు అనిల్‌కుమార్, బి.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లలో సినీనటుడు కిరణ్ సందడి



మాట్లాడుతున్న కిరణ్

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలోని నటరాజ్ థియేటర్‌లో సినీ నటుడు అబ్బవరం కిరణ్ శనివారం సందడి చేశారు. షో మధ్యలో ప్రేక్షకులతో మాట్లాడారు. తనను ఆదరిస్తున్న ప్రేక్షకుల రుణం తీర్చుకోలేనిదన్నారు. ఫిబ్రవరి 17న విడుదల కానున్న 'వినరో భాగ్యము విష్ణు కథ' సినిమా ప్రమోషన్‌లో భాగంగా సిరిసిల్లకు వచ్చారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణను తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

తెర్లుమద్దిలో పూజలు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని తెర్లుమద్ది బట్టోనితాళ్లలోని శ్రీరేణుక ఎల్లమ్మ, శ్రీపెద్దమ్మ ఆలయాలలో సినీహీరో కిరణ్ అబ్బవరం ప్రత్యేక పూజలు చేశారు. కిరణ్ సిరిసిల్లకు వెళ్తుండగా అభిమానుల కోరిక మేరకు తెర్లుమద్దికి వచ్చారు. ఈ సందర్భంగా కిరణ్‌ను గీతకార్మికులు, ముదిరాజ్ సంఘం నాయకులు సన్మానించారు. బాపురావు, విష్ణు, దేవరాజు, కృష్ణ, బాలచంద్రం, రవి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

జిల్లాకే చెక్కపల్లి ఆదర్శం

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు



చెక్కపల్లి సర్పంచ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

వేములవాడరూరల్: ఉత్తమ గ్రామపంచాయతీగా అవార్డు అందుకున్న చెక్కపల్లి సర్పంచ్ జైపాల్‌రెడ్డిని ఎమ్మెల్యే రమేశ్‌బాబు శనివారం సత్కరించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని చెక్కపల్లి అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. అన్ని గ్రామాలు సర్పంచులు చెక్కపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు.

రాజన్న సేవలో టీఎస్‌పీఎస్‌సీ సభ్యులు



వేములవాడ: రాజన్నను టీఎస్‌పీఎస్‌సీ సభ్యులు లింగారెడ్డి, చంద్రశేఖర్ రావు, సుమిత్రానంద్ కుటుంబ సభ్యులతో కలసి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎంసీ డైరెక్టర్‌కు గాయాలు

వేములవాడ: వేములవాడ మార్కెట్ కమిటీ సభ్యుడు కమలాకర్‌రెడ్డి శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, శనివారం కమలాకర్‌రెడ్డిని పరామర్శించారు.

సౌదీలో తెర్లుమద్దివాసి మృతి

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని తెర్లుమద్దికి చెందిన మామిండ్ల దశరథం(60) శనివారం సౌదీ అరేబియాలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గత ముప్పై ఏళ్లుగా సౌదీ అరేబియా వెళ్లి వస్తున్న దశరథం నెల రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చి వెళ్లాడు. సౌదీలో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. శుక్రవారం రాత్రి తన గదిలో నిద్రించిన దశరథం ఉదయం లేవకపోవడంతో సహచరులు లేపే ప్రయత్నం చేశారు. దశరథం నోటి వెంట రక్తం కారడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు కుటుంబికులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. దశరథం మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి వచ్చేలా చూడాలని గ్రామస్తులు కోరారు.

డ్రోన్ ద్వారా యూరియా సరఫరా



ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం పోతుగల్ సింగిల్‌విండో పరిధిలోని రైతులకు ఇఫ్కో కంపెనీ ద్వారా నానో యూరియాను డ్రోన్ల ద్వారా సరఫరా చేశారు. మండలంలోని కొండాపూర్‌లో శనివారం డ్రోన్ల సాయంతో యూరియా బస్తాలను పంట పొలాల వద్దకే సరఫరా చేసినట్లు సీఈవో కృష్ణ తెలిపారు. ఇఫ్కో కంపెనీ ప్రయోగాత్మకంగా చైర్మన్ తన్నీరు బాపురావు ప్రోత్సాహంతో పోతుగల్ సొసైటీ రైతులకు ఈ సేవలను అందిస్తోందని తెలిపారు. డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బొందుగుల దేవిరెడ్డి, రైతులు మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, మల్లయ్య, భూంరెడ్డి, సతీశ్, వెంకట్‌బాబు, సాయిరెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి



మాట్లాడుతున్న షఫీ ఉల్లా

వేములవాడఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ విద్యార్థులకు అందిస్తున్న ఉచిత విద్యను సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని రాష్ట్ర మైనార్టీ గురుకుల కార్యదర్శి షఫీఉల్లా కోరారు. వేములవాడ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలను శనివారం సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతి, విద్యాబోధనను పరిశీలించారు. షఫీ ఉల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై ఏడాదికి రూ.1.20 లక్షలు వెచ్చిస్తుందన్నారు. జిల్లా అధికారి దామోదర్, చీఫ్ విజిలెన్స్ అధికారి హబీబ్, మైనార్టీ శాఖ ఓఎస్‌డీ సర్వర్‌మియా, ప్రిన్సిపాల్ కుమార్ పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

సిరిసిల్లటౌన్: మహిళలు తమ హక్కుల కోసం పోరాటాలకు సిద్ధంకావాలని భారతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి కోరారు. సిరిసిల్లలో శనివారం జరిగిన మహిళా సమాఖ్య మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో మహిళలపై జరుగుతున్న వివక్షపై పోరాడాలన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో దళిత మహిళలపై రోజురోజుకు అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అమీనా, ఉపాధ్యక్షురాలు శాంత, సక్కుబాయి, ప్రధాన కార్యదర్శి అనసూయ, సహాయకార్యదర్శి లత, కోశాధికారి లక్ష్మి, నాయకులు మల్లేశం, సత్తవ్వ, సుదర్శన్, ఎల్లవ్వ, సరిత పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు విస్తరించాలి

- నార్మల్ డెలివరీలు పెంచాలి
- 'కంటి వెలుగు' సజావుగా నిర్వహించాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను విస్తరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, డాక్టర్లతో సమీక్షించారు. జిల్లాలో నార్మల్ డెలివరీలు పెంచాలని, తొలికాన్పులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో క్షయవ్యాధి బాధితులను గుర్తించి వైద్యసేవలందించాలని, ప్రైవేటు ఆస్పత్రుల్లో టీబీ నిర్ధారణ జరిగితే.. వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కంటివెలుగు రెండో విడత సవ్యంగా సాగేలా చూడాలని, ఇప్పటికే 22వేల మందికి పరీక్షలు చేశామని, షెడ్యూల్ ప్రకారం కంటిపరీక్షలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. జిల్లాకు మంజూరైన 35 ఆరోగ్య సబ్‌సెంటర్లలో ఇప్పటి వరకు 25 పూర్తయ్యాయని, మిగతా వాటిని ఫిబ్రవరిలోగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, జిల్లా డిప్యూటీ వైద్యాధికారి శ్రీరాములు, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, వేములవాడ ఆస్పత్రి పర్యవేక్షకులు మహేశ్‌రావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంధువులను పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత

ఇల్లంతకుంట(మానకొండూరు): మండలంలోని చింతలకుంటపల్లికి చెందిన తన బంధువు తన్నీరు లక్ష్మిబాయి ఇటీవల మృతిచెందగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఫుడ్ కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ ఉన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన డీఐజీ

చింతలకుంటపల్లి వచ్చిన ఎమ్మెల్సీ కవితను కరీంనగర్ రేంజ్ డీఐజీ రమేశ్‌నాయుడు, రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ చంద్రయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే

ఆలోచింపజేసిన మానేరు వెలస్కో 23 ప్రదర్శనలు



మానేరు పాఠశాలలో కరోనా ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

- ప్రారంభించిన ఐఎంఏ అధ్యక్షుడు రామ్‌కిరణ్

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్‌లో శనివారం మానేరు వెలస్కో–23 పేరిట నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకుంది. పాఠశాల విద్యార్థులు తమ మేథస్సుకు పదునుపెట్టి చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. మానేర్ వెలస్కో–23 కార్యక్రమాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.రాంకిరణ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. మానేరు విద్యార్థులు తమ మేథస్సుకు పదునుపెట్టి సమాజానికి ఉపయోగపడే విధంగా వినూత్న తరహాలో ప్రదర్శనలు చేయడం అభినందనీయమన్నారు. మానేరు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కడారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం క్లాస్‌రూంకే పరిమితం కాకుండా తమలోదాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అతి థులు విద్యార్థుల ప్రదర్శనల స్టాళ్లను తిలకించారు. మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, ప్రముఖ వైద్యులు సీహెచ్.రమణాచారి, ఎల్.అమృత్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, మానేరు విద్యాసంస్థల డైరెక్టర్లు సునీతారెడ్డి, శ్వేతారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ నాన్‌టీచింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లఅర్బన్: కేజీబీవీ నాన్‌టీచింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలని కేజీబీవీ నాన్‌టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంట నాగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గీత డిమాండ్‌చేశారు. సిరిసిల్లలో శనివారం నిర్వహించిన కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రథమ మహాసభలకు హాజరై మాట్లాడారు. 2005లో కేజీబీవీలను ప్రారంభించారని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా వేతనాలు పెంచకుండా, పనిభారాన్ని పెంచి వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాన్‌టీచింగ్ వర్కర్లకు రూ.26వేల వేతనం చెల్లించాలని కోరారు. ఇప్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమేశ్వర్, జిల్లా నాయకులు వేముల పర్శరాములు, కె.పర్శరాములు, మణెమ్మ, తుడుం శ్రీకాంత్, సుజాత, లావణ్య, అమృత, స్రవంతి, సుమలత, కల్పన, జయశీల, లలిత ఉన్నారు.



జెండా ఎగురవేస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గీత